# తల్లడిల్లిన తల్లి

**-తాటికోల పద్మావతి**

మధ్యాహ్నం ఒంటి గంట దాటింది. భోజనాలు చేద్దామనుకొంటూ సావిత్రమ్మ వంట గదిలోకి అడుగు పెట్టింది. ఇంతలో ఫోన్ మోగటంతో వెనక్కి వచ్చి తీసింది. అంతే ఒక్క క్షణం నోట మాట రాలేదు. మనిషిలో చలనం లేకుండా పోయింది. ఆ వార్త వినగానే గుండె ఎందుకు ఆగిపోలేదా అనిపించింది. ఒక్కసారిగా నేల మీద కుప్పకూలిపోయింది.

ఏమైందంటూ వచ్చింది కోడలు. ఏమండీ త్వరగా రండంటూ భర్తని పిలిచింది. వెంటనే కొడుకు గోపీ వచ్చాడు.

గోపీ! అంతా అయిపోయిందిరా! అంతా అయిపోయింది. నెత్తి నోరు బాదుకుంటూ శోకాలు పెడుతుంటే చూస్తున్న కొడుకు కోడలికి ఇద్దరికీ అర్థం కాలేదు.

అమ్మా! ఏమైందమ్మా? ఎక్కడ నుంచి ఫోన్? చేసిందెవరు? చెప్పమ్మా చెప్పమంటూంటే...

నీ చెల్లలు ఇక లేదురా. దాని జీవితం బుగ్గయి పోయిందిరా. ఎవరో ఫోన్ చేశారు. స్పృహ తప్పి పడిపోయిందిట. హాస్పటల్‌కి తీసుకెళ్ళారుట. అంతా అయిపోయిందని చెప్పారు. అయ్యో నా బిడ్డ గతి ఇలా అయిపోయిందే అంటూ సావిత్రమ్మ గగ్గోలు పెట్టింది.

వెంటనే గోపి చెల్లెలి అత్తవారింటికి ఫోన్ చేశాడు. సరైన సమాధానం ఎవరూ చెప్పలేదు.

భోజనాలు కూడా చేయకుండా అందినంత డబ్బు జేబులో పెట్టుకుని భార్య బిడ్డని, తల్లిని తీసుకుని వెంటనే బస్టాండు చేరుకున్నాడు. ఆకలి లేదు, దాహం లేదు. దుఃఖంతో కడుపు నిండిపోయిందందరికీ. ఆరు గంటలు ప్రయాణం చేసి వెళ్ళేసరికి శాంతను ఆస్పత్రిలో చేర్పించారని తెలిసింది.

ఎలా జరిగింది, ఎందుకు జరిగిందని వివరాలు తెలుసుకునే సరికి పెద్ద ఘోరం జరిగిపోయింది. అక్కడ చూసిన ప్రత్యక్ష సాక్షులంతా చెప్పారు. 'పెళ్ళికి ఇచ్చిన కట్నం చాల్లేదంటూ అపుడపుడు అదనంగా డబ్బు తెమ్మని వేధించేవాడు భర్త. ఇప్పుడు ఏకంగా గొంతు నులిమి చంపాడు. పదేళ్ళ కాపురం చేసిన భర్త దయా దాక్షిణ్యాలు లేకుండా చంపేశాడు.' శవాన్ని పోస్టుమార్టం చేసి మర్నాడు ఇచ్చారు.

చెల్లెలు బతుకును అన్యాయం చేసిన భర్తని వదిలిపెట్టకూడదనుకొన్నాడు గోపి. కేసు పెట్టించి అరెస్టు చేయించాడు. తనే నేరం చేసినట్టు ఒప్పుకున్నాడు. ఏడేళ్ళ కూతురుంది. అందరూ కలిసి చెల్లెలి ప్రాణాన్ని పొట్టనబెట్టుకున్నారు. కోపంతో కడుపు రగిలిపోతున్నది. వాడసలు భర్తా.. లేక రాక్షసుడా? అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేదు. పిల్లని తీసుకుని శవంతో పాటు ఊరు చేరుకున్నారు.

ఈ ఘోరం ఇలా జరుగుతుందని ఎవరూహించారు. అన్నీ స్వయంగా చెల్లెలికి అంత్యక్రియలు జరిపించాడు. పది రోజులు కర్మకాండలు ముగిశాయి. సావిత్రమ్మ కడుపు కోత మిగిలింది. ఆ దుఃఖంతోనే ఆమె మంచం పట్టింది. పెంచి పెద్దచేసి ఒక అయ్యచేతిలో పెడితే చివరికి బూడిదగా మిగిలింది. ఆడదాని బ్రతుకు అంత దారుణమా! కూతురి మరణంతో మంచం పట్టింది సావిత్రమ్మ.

ఎక్కడ నుంచో విత్తనం తెచ్చి నాటి ప్రతిరోజూ నీళ్ళు పోస్తుంటే మొక్క మొలిచి పెరిగి పెద్దదై చిగుళ్ళు తొడిగి ఒకనాటికి మహావృక్షమై కొమ్మలతో, రెమ్మలతో చెట్టునిండా పూలు, పండ్లతో పచ్చగా కళకళలాడుతుంటే ఆ చెట్టు క్రింద నీడ కోసం చేరుతారు కొంతమంది. వర్షం వచ్చినా నిలబడతారు. పక్షులెన్నో

---

## డటీజ్ 'అరుణా' రుణం

'మౌనమూ మాట్లాడుతుంది!
ఎందుకంటే-
'అమ్మ ఒక మనిషి'!?
'పాటల చెట్టు'కూ-
'గుప్పెడు గింజలు' కాస్తాయి!?
దటీజ్-
ఒక అరుణా 'రుణం'

**-లకుమ**

(ప్రముఖ కవయిత్రి ఎస్.అరుణ గారి నాలుగు పుస్తకాలు చదివిన స్ఫూర్తితో...)

---

## తేడా

**వే**సవి నిప్పులు... / తోడుగా పక్కింటి
ఎయిర్ కండిషనర్ / శబ్దాన్నీ వేడినీ
నా వాకిట్లోకి వదులుతోంది!
వాడు సమశీతోష్ణంలోనూ
చెమటలు కక్కుకుంటూ / ఈ నేల మీద నేనూ...

## భాషలు వేరయ

**కం**టికి / మనసుకు మధ్య
ఒక భాష / మనసుకు
చేతి కదలికకు / మరో భాష
నేను మనిషినా కాదా
అప్రయత్నంగా / కళ్ళంట నీరు!
బహుశా అది సమాజపు ఏడుపు!

## హ్యూమర్!

**జా**తీయతా
సుహృద్భావం
ఆటలట!
ఎందరికో
ఆటలు నేర్పిన
గురువట హ్యూమర్!
నువ్వు ఫిక్సింగ్
గొంతు తెరుస్తావని
నీ గొంతు నులిమేరుట!
హత్యలూ
పన్నాగాలతో
అది రాక్షస ఆటట!

## విలువ!

**ఎం**డ
కాస్తేనే చినుకుకు
విలువ!
చినుకులు
పడుతుంటేనే
ఎండకు విలువ!
మనిషి
సమతుల్యం పాటిస్తే
అన్నింటికీ విలువ!

-గుడిమెట్ల గోపాలకృష్ణ

గూళ్ళు కట్టుకుని నివశిస్తాయి. పిల్లలంతా ఆ చెట్టు నీడలో ఆడుకుంటారు. కాయలు కాస్తే పిందెలని కూడా చూడరు. రాళ్ళతో, కర్రలతో కొట్టి రాల్చి కడుపు నింపు కుంటారు. అయినా ఆ చెట్టు ఓర్పుతో భరిస్తుంది. కొమ్మలన్నీ నరికినా మళ్ళీ చిగుళ్ళు తొడుగుతుంది. హింసించినందుకు బాధపడదు. ప్రజల కోసం పుట్టి పెరిగింది. త్యాగశీలి అయింది. ఏదో ఒకనాడు ఆ వృక్షాన్ని మొదలంటా నరికి పెరికివేయవచ్చు. లేదా తుపాను గాలికి వేళ్ళతో సహా నేలవాలి పోవచ్చు.

అందుకే స్త్రీని (తరుణిని) తరువుతో పోలుస్తారు. ఎన్ని కష్టాలు భరించినా ఓర్పు, సహనంతో చివరిదాకా బ్రతుకుతుంది. మగువనై పుట్టడం కన్నా మానునై పుట్టినా బాగుండేదని విలపిస్తుంది.

నేటి సమాజంలో జరిగే దారుణాలను చూడలేక సావిత్రమ్మ తల్లడిల్లింది. ముప్పై ఐదేళ్ళు నిండినా పెళ్ళి కాలేని కూతురుగా, అసమర్థుడయిన తండ్రికి అధిక భారమై ఇంకా ఎన్నాళ్ళు ఇంట్లో పడి ఉంటావని ఇంట్లో వాళ్ళచేత, చుట్టుప్రక్కల వాళ్ళచేత చీదరింపులు తప్పలేదు.

వచ్చిన సంబంధాలన్నీ కట్నం చాల్లేదని వెళ్ళిపోతున్నారు. అందంలేదు, చదువులేదు. ఏదో ఇంట్లో అందరికీ వండిపెడుతుందిలే అని వరుసకు బావతో పెళ్ళి జరిపించారు. ప్రతి నిత్యం అత్తా ఆడబిడ్డల వేధింపులు, భర్త దూర్వాసుడు. ముక్కమీదే కోపం. ఒక సినిమా లేదు, షికారు లేదు. ఆర్టీసీలో ఉద్యోగం వచ్చే డబ్బు సగం తాగుడికే సరిపోతుంది. వచ్చే పోయేవాళ్ళందరికీ ఇంట్లో వండి వార్చటమే సరిపోతుంది. తిట్లు, చివాట్లు, మొట్టికాయలతో నరకం చూస్తున్నది సావిత్రి. ఎప్పుడైనా పుట్టింటి వాళ్ళకి తన వేళిదజిన చెప్పుకుందామంటే నీ ముఖానికి తోడు సినిమాలు, షికార్లు కూడానా. పెళ్ళయింది, సంతోషించు అంటారు. ఎప్పుడయినా భర్త వెంటనే తీసికెళితే వెళ్తుంది, లేకపోతే లేదు.

నువ్వందంగా లేవంటూనే కాపురం చేసి ఇద్దరు పిల్లల్ని కన్నాడు. తాగుడికి బానిసై ఒకరోజు హరీమన్నాడు. ఇంకేముంది, ఈ దరిద్రపుగొట్టుది నా కొడుకుని పొట్టన పెట్టుకుంది. పెళ్ళయినప్పటి నుంచి మొగుడికి మనశ్శాంతి లేకుండా చేసింది. అందుకే తాగుడికి బానిసై చచ్చాడంటూ అత్త, ఆడబిడ్డలు తిట్టిపోశారు.

ఏడ్చి ఏడ్చి కళ్ళల్లో నీళ్ళు ఇంకిపోయాయి. పిల్లలు ఎటూ కాని వయసు, ఉద్యోగం తాలూకు వచ్చిన డబ్బులు ఖర్మకాండలకు ఖర్చుచేశారు. మిగిలింది పిల్లలిద్దరి పేరా డిపాజిట్ చేశారు.

ఇల్లు గడవటం కష్టంగా ఉంది. ఇంట్లో కూర్చుంటే ఏం వస్తుందని సావిత్రి విస్తర్లు కుట్టేది. అప్పుడప్పుడు ఎవరికైనా ఇబ్బందయితే వెళ్ళి వంట చేసిపెట్టేది. పది ఇరవై వస్తే ఇంటికే ఖర్చు చేసేది.

కొన్నాళ్ళు కష్టపడితే నీ కొడుకు చేతికి అందొస్తాడు. కష్టాలన్నీ తీరిపోతాయన్నారు. ఆ ఆశతోనే కలలు కంటూ బ్రతికేది. కష్టాల్లో దరిద్రం అన్నట్టు పిల్ల పెద్దమనిషై కూచుంది. తూతూ మంత్రంగా వేడుకలు జరిపారు. కొడుకు టెన్త్ పాసై కాలేజీలో చేరాడు. అమ్మా నాకు పట్టులంగా కొనిపెట్టవా! ఫంక్షన్ కూడా సరిగా చేయలేదంది కూతురు. నాన్న ఉంటే అన్నీ చేసేవాడు. అన్నయ్యకి కాలేజీ ఫీజులంటూ కట్టి చదివిస్తావు. నాకేమీ లేవంటూ గోలపెట్టింది.

మనం అందరిలాంటి వాళ్ళం కాదమ్మా. ఉన్న దాంట్లోనే సర్దుకోవాలి. రేపు అన్నయ్యకి మంచి ఉద్యోగం వస్తే అపుడన్నీ కొనిస్తాడులే అంటూ కూతురికి నచ్చచెప్పింది.

కాలమంతా కష్టాలతోనే గడిచిపోయింది. బ్యాంకుకు వెళ్ళి సంతకం పెట్టాలి రమ్మన్నారు భర్త తరఫు బంధువులు. సరేనంటూ వెళ్ళింది. ఎంత వచ్చిందో ఏమో లెక్కలు చెప్పనేలేదు. కొడుక్కి మైనారిటీ తీరింది.

అమ్మా మా ఫ్రెండు ఒక షాపు పెట్టాడు. నన్ను కూడా కలవమన్నాడు. నా వంతు డబ్బు పెట్టుబడి కావాలన్నాడు. ఊరికే బ్యాంకులో ఉంటే ఏం లాభం. నేను చదివిన చదువుకి ఉద్యోగం ఎటూ రాదు. బిజినెస్ చేస్తానన్నాడు.

నువ్వు చిన్నవాడివి. బిజినెస్ వ్యవహారాలు నీకంతగా తెలియవు. లాభం రాకపోతే ఆ నష్టం నీమీదే వేస్తారు. ఇంకో రెండేళ్ళు పోతే చెల్లెలి పెళ్ళి చెయ్యాలి. అప్పుడు డబ్బు ఎక్కడినుంచి వస్తుంది. బిజినెస్ జోలికి వెళ్ళకుండా బుద్ధిగా చదువుకో.

ఎంత చదివినా ఈ రోజుల్లో ఉద్యోగాలు రావడం కష్టం. బిజినెస్‌లో ఎంత మంది పైకి రావడంలేదు. మా ఫ్రెండ్ వాళ్ళ నాన్న రెండు బిల్డింగ్‌లు కొన్నాడు. మొదట్లో రాకపోయినా పోనుపోను బాగా ఆదాయం ఉంటుంది. ఇలాగే ఉంటే ఎప్పటికీ పైకి రాలేం. అవ

## దీపోత్సవం

రాత్రి
అగాధ నిశ్శబ్దం వాకిట్లో
నక్షత్ర దీపోత్సవం!
ధాత్రి
అనుభూతి హృదిపొదలో
చలనశీల శబ్దకవితా గానం!

## పల్లవి

జీవన వేణువు తంత్రిపై
అనుభవ పల్లవి రాగం!
వాస్తవాదర్శ పెదాలపై
మకరంద స్పర్శాభిషేకం!!

## పునర్జన్మ

కర్షకుని చేతి / హలంనై-
కార్మికుని చేతి / స్తుతినై-
కర్మ సాక్షి కంటి / కిరణమై-
కవి యింట / కలమునై
నే పుట్టివుంటే / ఎంత బాగుండేది..!

## ప్రగతి

కలం హలంతో
కవితా పొలందున్ని
మానవతను పండిస్తే
ప్రగతి పూవు
పరిమళిస్తుంది!

## వర్షం

సూర్యుని
తీక్షణ వీక్షణాలకు
కనలి ఆవిరవుతున్న
సముద్రాన్ని చూచి
గుండె ద్రవించిన
వినీల విహాయసం
వలవలా కన్నీరొలికింది!

-సి. కామేశ్వరరావు

కాశం వచ్చినప్పుడే ఉపయోగించుకోవాలి. నువ్వు ఎన్నయినా చెప్పు, నేను మాత్రం పార్టనర్‌షిప్ తీసుకుని తీరాల్సిందేనంటూ పట్టుబట్టాడు.

భర్తలాగే కొడుకు కూడా అనుకున్నది సాధించే వరకూ ఊరుకోడు. తల్లి మాట వినకుండా డబ్బంతా తీసుకెళ్లి పెట్టుబడి పెట్టాడు. ఆరు నెలలు గడిచిందో లేదో ఆ ఫ్రెండు కాస్తా చెప్పా పెట్టకుండా ఎక్కడికో ఉడా యించాడు. ఉన్న సరుకు స్వాధీనం చేసుకుని బయటకు పంపించారు. సావిత్రమ్మ ఏడ్చింది. మొత్తు కుంది. గగ్గోలు పెట్టింది. చేతికి ఆధారం అనుకున్న ఆ కాస్త డబ్బూ పోయింది.

పోతే పోయిందిలే నా వాటా డబ్బేగా అన్నాడు. చెల్లెలి పెళ్ళికని దాచింది కూడా పట్టుకుపోయాడు. స్నేహితులు తిరుగుళ్ళ నుంచి బయటపడే సరికి ఉన్నదంతా అయిపోయింది. అప్పుడు జ్ఞానోదయం కలిగి ఏం ప్రయోజనం.

నా మాట విన్నావా, ఆ సంబంధం వాళ్ళు వచ్చారు. మనమ్మాయిని చేసుకోవటానికి ఒప్పు కున్నారు. కట్నం లేకుండా ఎవరు చేసుకుంటారు. చేతిలో పైసా లేదు. చెల్లెలి పెళ్ళి ఎలా చేస్తావో నీ ఇష్టం. ఆడపిల్లని ఎన్నాళ్ళు ఇంట్లో ఉంచుకుంటాం. ఆ స్థలం అమ్మేసి పెళ్ళి చేద్దాం.

అదా! అది కాస్తా అమ్మితే మనకి నిలువ నీడ ఉండదు. అదే మనకి ఆధారం. నువ్వేదన్నా ఉద్యోగం చేసి పెళ్ళిచేస్తావని నీ మీద ఎన్నో ఆశలు పెట్టు కున్నాను. సంపాదించింది లేకపోగా ఉన్నది కూడా పోగొట్టావు.

నేను ఉద్యోగంలో చేరటానికి టైం పడుతుంది. అప్పటిదాకా పెళ్ళి చేయకుండా ఉంటావా? నీ ఇష్టం అన్నాడు కొడుకు.

పుట్టింట్లో తండ్రి చెప్పినట్లు వినాలి. పెళ్ళయ్యాక భర్త మాట వినాలి. ఇప్పుడు కొడుకు మాట వినాలి. ఆడది ఎప్పుడూ ఎవరో ఒకరి మీద ఆధారపడి ఉండాల్సిందే. స్వతంత్రించి బతికే హక్కు లేదు.

చేసేదేమీ లేక ఎప్పుడో భర్త బ్రతికున్న రోజుల్లో చవగ్గా వచ్చిందని కొని పడేసిన స్థలం అది. అది అమ్మితేగాని పెళ్ళి చేయలేరు. వచ్చిన కాడికి అమ్మడం కూతురు పెళ్ళి చేసి అత్తవారింటికి పంపడం జరిగిపోయాయి. వెంటనే ఒక ఆడపిల్ల పుట్టింది.

కాపురానికి వెళ్ళిందన్న మాటే గాని సుఖపడింది లేదు. ఎప్పుడూ గొడవలే. తిట్టి కొట్టేవాడు. రెండు మూడు సార్లు చంపటానికి కూడా ప్రయత్నించాడు.

అమ్మా నేనుండలేనిక్కడ, వచ్చేస్తానంటూ చెప్పింది. తప్పదమ్మా కొట్టినా, తిట్టినా భర్త దగ్గరే పడి ఉండా లన్నారు. మనసుకి ఎంతో బాధనిపించి ఒకసారి వచ్చి మళ్ళీ కాపురానికి వెళ్ళింది. నచ్చచెప్పి పంపించారు.

అల్లుడు ఒక శాడిస్టు. ప్రతిరోజూ నరకం చూపించేవాడు. తల్లిగా తను ఏమీ చేయలేకపోయింది.

ఈలోగా కొడుక్కి పెళ్ళి కావడం, వేరే ఊర్లో ఉద్యోగం రావడం జరిగాయి. సావిత్రమ్మకు కొడుకు దగ్గరకు వెళ్ళక తప్పలేదు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకోబోయే వరకూ వంచిన నడుం ఎత్తకుండా చాకిరి. కోడలు కూడా ఉద్యోగానికి వెళ్ళటంతో పని భారమై అలసిపోయింది. వృద్ధాప్యంలో కూడా సుఖం లేదు. ఏమిటీ బ్రతుకు. పుట్టినప్పటి నుంచీ కష్టాలే. జీవితం చివరి దశకు చేరుకొంది. చీదరింపులు, ఛీత్కా రాలు. ఎప్పుడో గొంతెండి పోతుంటే గుక్కెడు నీళ్ళు ఒక్క పూట గుప్పెడు మెతుకులు.

కూతురు పోవటంతో ఆ పిల్ల భారం కూడా మీదపడింది. తనే గనుక లేకపోతే ఆ పసిదాన్ని ఏ అనాథ శరణాలయంలోనో చేర్పించేవాళ్ళు. బాధ్యతలు, బంధాలు వీడనంటున్నాయి. బంధ విముక్తురాలు కావాలన్నా పైనుంచి ఆ దేవుడి పిలుపు రావాలి. కొంత మంది జీవితాలు ఇంతే. కష్టాలతోనే కడతేరి పోతారు.

కళ్ళు మూతలుపడిపోతున్నాయి. అమ్మమ్మా అని పిలుస్తున్నది మనుమరాలు.

ఉదయం కోడలంటున్న మాటలు చెవుల్లో మారు మ్రోగుతున్నాయి. ఎన్నాళ్ళు మంచంలో పడి ఉం టుంది. ఈమెకి చాకిరీ చేస్తూ కూర్చుంటే ఉద్యోగానికి పోనవసరం లేదా? ఏ ఆశ్రమంలోనో చేర్పించండి. ఉన్నన్నాళ్ళు అక్కడే పడి ఉంటుంది.

చివరికి ఇదేనా తను కోరుకుంది. కొడుకు దగ్గర సుఖపడాలనుకుంది. తనకి ఆ అదృష్టం కూడా లేదు. తండ్రికి కూతురుగా, భర్తకి భార్యగా, బిడ్డలకి తల్లిగా అందరి బాధ్యతలు మోసింది. తన భారాన్ని ఎవరూ మోయలేకపోతున్నారు. తల్లడిల్లిన ఆ తల్లి హృదయం ఒక్కసారిగా ఆగిపోయింది. ఎక్కడో ఆశ్రమంలో అనాథ చావు చావకుండా కొడుకు దగ్గరే ప్రాణాలు వదిలింది. చివరి క్షణంలో తల్లడిల్లిన తల్లి తనువు చాలించటంతో ఆమెతోనే కష్టాలన్నీ కలసి కాలిపోయాయి.

తల్లిలేని పిల్లమాత్రం అనాథాశ్రమంలో చేరక తప్ప లేదు. మనిషికి మనీతోనే ఉన్నాయి సంబంధాలన్నీ! ■